Follow: @ANNTELUGU

ANN తెలుగు

REGISTERED NUMBER:
APTEL/2014/58382

16-09-2025

# మహా పత్రిక

తిరుపతి, హైదరాబాద్

సంపుటి- 22 సంచిక- 283 పేజీలు-04 వెల-రూ.6

PUBLISHED FROM TIRUPATI | HYDERABAD

మంగళవారం

WWW.EPAPER.MAHAADAILY.COM




## అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు

దరఖాస్తులను స్వీకరించేందుకు ప్రత్యేక వెబ్ సైట్ రూపొందించాలి

అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచనలు

జర్నలిస్టుల హెల్త్ పాలసీ, అక్రిడిటేషన్ పాలసీపై సమగ్రంగా చర్చించామని వెల్లడి

**హైదరాబాద్, మహా:** ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన జర్నలిస్టులను ప్రభుత్వం ఎప్పుడూ గౌరవిస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉందని చెప్పారు. సోమవారం బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో హోమ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రవి గుప్తా, ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, ఐ అండ్ పిఆర్ స్పెషల్ కమీషనర్

మిగతా 2లో

టాప్ న్యూస్

### భూలోకంలోనే నరకం అనుభవించా..


- నన్ను బీఆర్ఎస్ నుండి బయటకు పంపి ఏం సాధించారు?
- హుజూరాబాద్ లో ఎంపీ ఈటల రాజేందర్ ఆసక్తికర వ్యాఖ్యలు



03

### బండి సంజయ్‌కు షాక్

- రూ.10 కోట్ల పరువు నష్టం దావా వేసిన కేటీఆర్
- డిసెంబర్ 15కు వాయిదా



02

### కేటీఆర్‌కు కౌంటర్

- న్యాయపరంగా ఎదుర్కొంటా
- బెదిరించేందుకు ఇజ్జత్ దావా వేయను
- కేంద్రమంత్రి బండి సంజయ్
- నేను లవంగం తింటే తంబాకు అన్నావ్
- దైవసన్నిధిలో ప్రమాణానికి రమ్మని సవాల్ చేశా



02

# రేవంత్ సర్కార్ గుడ్ న్యూస్

## ప్రైవేట్ కళాశాలల బకాయిలు రిలీజ్

ఈ వారంలో రూ.600 కోట్లు.. దీపావళికి మరో రూ.600కోట్లు

కళాశాలల బంద్ పై ముఖ్యమంత్రి రేవంత్ సమీక్ష

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు కు బాధ్యతల అప్పగింత

చర్చలు సఫలం.. యాజమాన్యాల హర్షం



**హైదరాబాద్, మహా :** ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల ప్రతినిధులతో తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జరిపిన చర్చలు ఫలించాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలంటూ సోమవారం నుంచి ఉన్నత విద్యాసంస్థలు బంద్ చేపట్టాయి. దీంతో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మంత్రులతో భేటీ అయ్యారు. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల తీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ తర్వాత సమస్య పరిష్కారంపై మంత్రులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలతో మంత్రులు సమావేశం అయ్యారు. ఈ మేరకు ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలతో చర్చలు సానుకూలంగా ముగిసినట్లు ఉపముఖ్యమంత్రి భట్టి తెలిపారు. బంద్ విరమణకు ప్రైవేట్ కాలేజీలు అంగీకరించినట్లు ఆయన పేర్కొన్నారు.

మిగతా 2లో

### గ్రామాల్లో వీధి దీపాల బాధ్యతలు సర్పంచులకే..

- రాష్ట్రమంతా ఎల్ఈడీ లైట్లపై పక్కాగా పర్యవేక్షణ ఉండాలి
- కొత్తగా ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు, నిర్వహణకు టెండర్లను పిలవండి
- నిర్వహణ పక్కగా ఉండేందుకు వీలుగా టెండర్ నిబంధనలు రూపొందించాలి
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు
- పంచాయతీరాజ్, మున్సిపల్, జీహెచ్ఎంసీపై ఆఫీసర్లతో సీఎం రివ్యూ

02



## తెలంగాణ రాష్ట్రాన్ని సమిష్టిగా అభివృద్ధి చేద్దాం

### మంచిర్యాల రైల్వే స్టేషన్ ఆధునికరణకు 26 కోట్లు

తెలంగాణలో ఐదు వందే భారత్ రైళ్ళు నడుస్తున్నాయి...మరో రెండు రైళ్లకు ప్రతిపాదనలు

మంచిర్యాల వందే భారత్ రైలు హాల్టింగ్ సభలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

**మంచిర్యాల, మహా :** తెలంగాణ రాష్ట్రాన్ని సమిష్టిగా అభివృద్ధి చేద్దామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడించారు. సోమవారం మంచిర్యాల రైల్వే స్టేషన్ లో వందే భారత్ రైలు నిలుపుదల కార్యక్రమానికి ఆయనతో పాటు తెలంగాణ కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద, పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్సీ చిన్నమల అంజిరెడ్డి, డిఆర్ఎం గోపాలకృష్ణ, రైల్వే శాఖ ఉన్నతాధికారులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

మిగతా 2లో

## ఊర్లలో అత్తాకోడళ్ల మధ్య కొత్త పంచాయితీ

- పట్టపగలే దోపిడీలు, అత్యాచారాలు జరుగుతున్నాయి
- కాంగ్రెస్ నేతల కనుసన్నల్లోనే యూరియా బ్లాక్ మార్కెట్
- హైదరాబాద్‌ను ఆగం చేసినందుకు కాంగ్రెస్ కు జూబ్లీహిల్స్ ప్రజలు బుద్ధి చెప్పాలి
- జూబ్లీహిల్స్ నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్



02


SRI GOLD
TRUSTED GOLD BUYERS


| బంగారం ధరలు | |
|---|---|
| 24 క్యారెట్ | 1,11,060 |
| 22 క్యారెట్ | 1,01,800 |
| సిల్వర్ (కేజీ) | 1,33,000 |



### ప్రజాపాలన దినోత్సవంగా సెప్టెంబర్ 17

- జిల్లాలో ఇంఛార్జి మంత్రులు జాతీయ జెండా ఎగురవేయాలి
- సర్క్యులర్ జారీ చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం

02

| స్టాక్ మార్కెట్ | |
|---|---|
| సెన్సెక్స్ ↗ | 81,568.58 |
| నిఫ్టీ ↗ | 25,014 |

**ఈరోజు చికెన్ ధరలు**

1 కేజీ రిటైల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 190 | 230 | 250 |

హోల్ సేల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 170 | 210 | 220 |

**ఈరోజు గుడ్డు ధరలు**

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 5.35 | 160.5 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 5.35 | 160.5 |
| రిటైల్ గుడ్డు ధర | 5.67 | 170.13 |

### బకాయిలు బీఆర్ఎస్ పాపాలే..

- బకాయిల భారాన్ని కాంగ్రెస్‌పై మోపింది
- ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని చిన్నభిన్నం చేసింది: భట్టి విక్రమార్క
- రూ. 600 కోట్లు విడుదల చేసినందుకు ధన్యవాదాలు: కళాశాల యాజమాన్యాల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు



02



03


### తెలంగాణకు అదనంగా 40 వేల టన్నుల యూరియా

ఈ నెలలో 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కావాలని మంత్రి వినతి

ఈ వారం 80వేల టన్నుల సరఫరాకు కేంద్రం అంగీకారం

వరి, మొక్కజొన్న, పత్తి ప్రధాన పంటలకు యూరియా అత్యవసరం

# పదవుల జాతర



### టీపీసీసీ చీఫ్ కసరత్తు

ఇప్పటికే వడపోతలు.. కమిటీల నివేదికలు

కాంగ్రెస్ క్యాడర్ లో జోష్ నింపడమే టార్గెట్

పీసీసీ చీఫ్ కు శుభాకాంక్షల వెల్లువ

**హైదరాబాద్, మహా:**

కాంగ్రెస్ పార్టీలో పదవుల జాతరకు రంగం సిద్ధమైంది. ఎంతో కాలంగా ఊరిస్తున్న పార్టీ కమిటీలపై మళ్ళీ కదలిక మొదలైంది. రెండు, మూడు రోజుల్లో జిల్లా కాంగ్రెస్ కమిటీల ప్రకటనకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే క్వార్టర్స్ లో ఉమ్మడి జిల్లాల ఇంచార్జ్ లు, డీసీసీ అధ్యక్షులతో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చర్చించారు. ఇప్పటికే జిల్లా కమిటీల విషయంలో పార్టీ నియమించిన ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ లు, పార్లమెంట్ ఇంచార్జ్ లు, అసెంబ్లీ ఇంచార్జ్ లతో సమావేశాలు నిర్వహించగా, అందరు నాయకుల ఆమోదంతో ఏఐసీసీ సూచన మేరకు జిల్లా కమిటీలను ఖరారుచేయనున్నారు. రెండు మూడు రోజులలో పూర్తి స్థాయి లో డీసీసీ కమిటీల ప్రకటనకు కసరత్తు చేస్తున్నట్లు చెబుతున్నారు. గతంలో పలుమార్లు అనేక కసరత్తులు జరగ్గా, స్థానిక ఎన్నికలకు ముందు జోష్ నింపాలని టీపీసీసీ భావిస్తోంది. పీసీసీ చీఫ్ గా బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయిన నేపథ్యంలో మహేష్ గౌడ్ కు శుభాకాంక్షల వెల్లువ కొనసాగింది. మంత్రులు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్ తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, కార్పోరేషన్ ఛైర్మన్ లు పీసీసీ చీఫ్ ను అభినందించారు.




# అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు

## దరఖాస్తులను స్వీకరించేందుకు ప్రత్యేక వెబ్ సైట్ రూపొందించాలి

### అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచనలు

### జర్నలిస్టుల హెల్త్ పాలసీ, అక్రిడిటేషన్ పాలసీపై సమగ్రంగా చర్చించామని వెల్లడి

(మొదటిపేజీ తరువాయి)

సిహెచ్.ప్రియాంక, సీఎం సీపీఆర్వో జి.మల్సూర్, కార్మిక శాఖ అడిషనల్ కమిషనర్ గంగాధర్, ఆరోగ్యశ్రీ సీఈఓ ఉదయ్ కుమార్ తో కలిసి మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా అక్రిడిటేషన్ పాలసీ, జర్నలిస్టుల హెల్త్ పాలసీ, జర్నలిస్టుల అవార్డులు, జర్నలిస్టులపై దాడులకు సంబంధించి హైపవర్ కమిటీ తదతర అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందేలా విధివిధానాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు.



**దరఖాస్తులను స్వీకరించేందుకు ప్రత్యేక వెబ్ సైట్..**

జర్నలిస్టులపై దాడులు జరగకుండా ప్రభుత్వం అన్నీ చర్యలు తీసుకుంటుందని, ఇందుకోసం హై పవర్ కమిటీని కూడా పునరుద్దరించాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్టు మంత్రి తెలిపారు. దీనికి సంబంధించి ఉమ్మడి రాష్ట్రంలో 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జీవో జారీ చేసిందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆ ఊసే ఎత్తలేదని అన్నారు. జర్నలిస్టుల జీత భత్యాలకు సంబంధించి త్రైపాక్షిక కమిటీని కూడా పునరుద్దరిస్తున్నామన్నారు. జర్నలిస్టుల హెల్త్ పాలసీపై సమగ్రంగా చర్చించామని, ఇన్సూరెన్స్ పాలసీలో ఏది జర్నలిస్టులకు ప్రయోజనకరంగా ఉంటుందనే అంశంపై ఆరోగ్యశ్రీ విభాగంతో కలిసి లోతైన అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. అక్రిడిటేషన్ పాలసీపై కూడా సుదీర్ఘంగా చర్చించామని, జర్నలిస్టుల నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు ప్రత్యేక వెబ్ సైట్‌ను తక్షణమే రూపొందించాలని, జర్నలిస్టులకు అవార్డులను పునరుద్దరించాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. త్వరలోనే జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

# బకాయిలు బీఆర్ఎస్ పాపాలే..

## బకాయిల భారాన్ని కాంగ్రెస్‌పై మోపింది

### ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని చిన్నభిన్నం చేసింది: భట్టి విక్రమార్క

### రూ. 600 కోట్లు విడుదల చేసినందుకు ధన్యవాదాలు: కళాశాల యాజమాన్యాల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు

**హైదరాబాద్, మహా:** పేద విద్యార్థుల భవిష్యత్తుకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశంపై ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలతో జరిగిన చర్చల తర్వాత భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే తీసుకొచ్చిందని ఆయన గుర్తు చేశారు. అయితే, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకాన్ని చిన్నాభిన్నం చేసి, బకాయిల భారాన్ని తమపై మోపిందని ఆరోపించారు. "ఆ విచ్చిన్నాన్ని సరిదిద్దుకుంటూ ఈ ప్రభుత్వం ముందుకు వెళ్తుంది" అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న బకాయిల నుండి రూ. 600 కోట్లు త్వరితగతిన విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. మిగిలిన బకాయిలను ప్రతినెలా కొంత చొప్పున చెల్లిస్తూ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ నిర్ణయానికి యాజమాన్యాలు సానుకూలంగా స్పందించి బంద్‌ను విరమించాయని తెలిపారు. చర్చల సందర్భంగా, కళాశాల యాజమాన్యాలు ఒక కమిటీని ఏర్పాటు చేయాలని కోరగా, ప్రభుత్వం అందుకు అంగీకరించింది. రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, కళాశాల యాజమాన్యాల ప్రతినిధులతో కలిసి ఈ కమిటీని ఏర్పాటు చేస్తామని భట్టి విక్రమార్క ప్రకటించారు. కళాశాల యాజమాన్యాల సంఘాల సమాఖ్య అధ్యక్షులు రమేష్‌బాబు మాట్లాడుతూ, "పాత ప్రభుత్వం చేసిన పాపాలు మా నెత్తిన బడినప్పటికీ, మాయందు దయతలచి రూ. 600 కోట్లు విడుదల చేసినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు" అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి తమ సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని ఆయన హామీ ఇచ్చారు. ఈ నిర్ణయంతో విద్యార్థులకు, కళాశాలలకు కొంత ఊరట లభించింది.

# గ్రామాల్లో వీధి దీపాల బాధ్యతలు సర్పంచులకే..

## రాష్ట్రమంతా ఎల్ఈడీ లైట్లపై పక్కాగా పర్యవేక్షణ ఉండాలి

### కొత్తగా ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు, నిర్వహణకు టెండర్లను పిలవండి

### నిర్వహణ పక్కగా ఉండేందుకు వీలుగా టెండర్ నిబంధనలు రూపొందించాలి

### అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు

### పంచాయతీరాజ్, మున్సిపల్, జీహెచ్ఎంసీపై ఆఫీసర్లతో సీఎం రివ్యూ

**హైదరాబాద్, మహా:** రాష్ట్రమంతా ఎల్ఈడీ వీధి దీపాలపై పక్కాగా పర్యవేక్షణ ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అన్ని గ్రామాల్లో వీధి దీపాల ఏర్పాటు, వాటి నిర్వహణ బాధ్యతలను సర్పంచులకే అప్పగించాలని చెప్పారు. గ్రామాల్లో అవసరమైనన్ని కొత్త ఎల్ఈడీ లైట్లను అమర్చటంతో పాటు వాటిని సమర్థంగా నిర్వహించే అధికారం గ్రామ పంచాయతీల పరిధిలోనే ఉండాలని స్పష్టం చేశారు. పంచాయతీ రాజ్, మున్సిపల్, జీహెచ్ఎంసీ విభాగాలకు సంబంధించి ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వీధి దీపాలకు సంబంధించి గ్రామాల్లో ఇప్పటికే అందుబాటులో ఉన్న ఎల్ఈడీ లైట్లు వెలుగుతున్నాయా లేదా, కొత్తగా ఎన్ని అవసరం ఉన్నాయో పక్కాగా అంచనా వేయాలని, ప్రతి పోల్ లెక్కించేలా సర్వే చేయాలని పంచాయతీ రాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. రాత్రి పూట ఎల్ఈడీ లైట్లు పని చేయటంతో పాటు పగటిపూట దుర్వినియోగం కాకుండా పర్యవేక్షణ ఉండాలని, అన్ని గ్రామాల ఎల్ఈడీ డ్యాష్‌బోర్డు మండల స్థాయిలో ఎంపీడీవో పర్యవేక్షణలో ఉండాలని చెప్పారు. జిల్లాలో అడిషనల్ కలెక్టర్‌కు ఈ బాధ్యతలు అప్పగించాలన్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాల పరిధిలో 16.16 లక్షల ఎల్ఈడీ లైట్లున్నాయని, వరంగల్, నల్గొండ, జనగాం, నారాయణపేట జిల్లాల్లో ఎల్ఈడీ లైట్ల కాంట్రాక్టు ఏజెన్సీ ఆధ్వర్యంలో ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అన్ని గ్రామాల్లో సర్పంచులకే వీటిని అప్పగిస్తే.. లైట్ల నిర్వహణ, విద్యుత్తు దుర్వినియోగం కాకుండా అడ్డుకట్ట పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి

## ఏడేండ్ల పాటు నిర్వహణ బాధ్యతలు..

రాష్ట్రంలో అన్ని ఎల్ఈడీ లైట్లను హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న 5.50 లక్షల ఎల్ఈడీ లైట్లు ఉన్నాయని, అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ సిటీని కూడా కలిపితే మొత్తం 7.50 లక్షల లైట్లు అవసరమవుతాయని మున్సిపల్ శాఖ నివేదించింది. కోర్ అర్బన్ సిటీ పరిధిలో జీహెచ్ఎంసీతో పాటు కొత్తగా చేరిన కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామాలన్నింటిని పరిగణనలోకి తీసుకొని ఎల్ఈడీ లైట్ల అవసరాన్ని అంచనా వేయాలని చెప్పారు. కొత్తగా ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు, నిర్వహణకు టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు. ఎల్ఈడీ లైట్ల తయారీలో పేరొందిన కంపెనీలను ఆహ్వానించాలని, ఏడేండ్ల పాటు నిర్వహణ బాధ్యతలు కంపెనీలకు అప్పగించాలని, నిర్వహణ పక్కగా ఉండేందుకు వీలుగా టెండర్ నిబంధనలను రూపొందించాలని చెప్పారు. ఎల్ఈడీ లైట్లతో పాటు కంట్రోల్ బాక్స్‌ల ఏర్పాటు, వాటి పనితీరును నిరంతరం పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా వ్యవస్థ ఉండాలన్నారు. హైదరాబాద్ ఐఐటీ లాంటి సంస్థలతో థర్డ్ పార్టీ ఆడిట్ చేయించాలని సూచించారు. జీహెచ్ఎంసీ పరిధిలో వీధి దీపాలకు ప్రతి నెలా రూ. 8 కోట్ల కరెంటు బిల్లు అవుతున్నందున, సోలార్ పవర్ వినియోగించే అంశాన్ని, అందుకు అవసరమైన సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు.

# భారత్‌తో అమెరికా వాణిజ్య చర్చలు

## ఇండియాకు బ్రెండెన్ లించ్.. నేడు చర్చలు... నవంబర్ నాటికి తొలివిడత ఒప్పందం

**ఢిల్లీ, మహా:** సుంకాల ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్, అమెరికా మధ్య వాణిజ్య చర్చలు తిరిగి ప్రారంభం కానున్నాయి. ఈ విషయాన్ని ట్రంప్ సలహాదారు పీటర్ నవారో వెల్లడించారు. ఢిల్లీ వేదికగా మంగళవారం నుంచి ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై ఇరు దేశాల మధ్య చర్చలు జరగనున్నాయి. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో భారత్‌పై అగ్రరాజ్యం విధించిన 50శాతం సుంకాలు అమల్లోకి వచ్చిన తర్వాత తొలిసారి ఇరుదేశాల మధ్య చర్చలు జరగనున్నాయి. అమెరికాతో మంగళవారం ఆరోవిడత చర్చలు జరగనున్నట్లు వాణిజ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అమెరికా ప్రతినిధి బ్రెండెన్ లించ్ ఈ చర్చల్లో పాల్గొంటారని తెలిపింది. ఆగస్టులో ఆరోవిడత చర్చలు జరగాల్సి ఉండగా సుంకాలను అమెరికా 50శాతానికి పెంచటంతో సంప్రదింపులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. అంతకుముందు అమెరికా దిగుమతులపై ఏ దేశం వేయనంతగా భారత్ ఎక్కువ సుంకాలు వసూలు చేస్తోందని నవారో ఆరోపించారు. ఈ భారీ టారిఫ్‌లను తాము ఎదుర్కోవాల్సి వస్తోందని విమర్శించారు. ఉక్రెయిన్ భూభాగాన్ని రష్యా ఆక్రమించక ముందు ఆ దేశంతో భారత్ చమురు కొనుగోలు తక్కువగానే ఉండేదని తెలిపారు. ఆ తర్వాత నుంచి పెద్దమొత్తంలో లాభం పొందేందుకు ఎక్కువగా కొనుగోళ్లు చేస్తోందని చెప్పారు. యూరోపియన్ యూనియన్,



జపాన్, దక్షిణ కొరియా, ఫిలిప్పీన్స్, ఇండోనేసియా వంటి దేశాలు అమెరికాతో గొప్ప వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నాయని గుర్తు చేశారు. అమెరికా నుంచి లాభం పొందామని, అగ్రరాజ్యం మార్కెట్లు తమకు అవసరమనే విషయాన్ని ఆ దేశాలు గుర్తించాయని పేర్కొన్నారు. ఈక్రమంలోనే భారత్ కూడా ఏదో ఒక సమయంలో తమ దారికి రావాల్సిందేనని అభిప్రాయపడ్డారు. అలాకాకుండా రష్యా, చైనాలతో పొత్తు పెట్టుకోవాలనుకుంటే భారత్‌కు మంచి ముగింపు ఉండదంటూ హెచ్చరించారు.

**స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై ముందుకు**

మరోవైపు ఇదే విషయాన్ని వాణిజ్య మంత్రిత్వ శాఖ కార్యదర్శి సునీల్ బర్త్వాల్ ధ్రువీకరించారు. 'భారత్ ఇప్పుడు అమెరికాతో మాత్రమే కాక, అనేక దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై ముందుకు వెళ్లడానికి సిద్ధంగా ఉంది. జీఎస్టీ సంస్కరణలు, వాణిజ్య కార్యక్రమాల గురించి ఇతర దేశాలకు తెలియజేయడానికి మేం వివిధ మిషన్లతో చురుకుగా పనిచేస్తున్నాం. చర్చల సామర్థ్యం పెరిగింది. అనేక ఉత్పత్తుల కోసం ప్రామాణిక ఆపరేటింగ్ విధానాలు అమల్లో ఉన్నాయి' అని సునీల్ తెలిపారు. అమెరికాభారత్ మధ్య వాణిజ్య చర్చలు మార్చి నుంచి జరుగుతున్నాయి. ఇప్పటి వరకు ఇరు దేశాల ప్రతినిధులు ఐదు సార్లు చర్చలు జరిపారు. ఆరో దఫా చర్చల కోసం ఆగస్టు 25న అమెరికా నిపుణుల బృందం భారత్‌కు రావాల్సి ఉంది. కానీ సుంకాల ఎఫెక్ట్‌తో ఆ పర్యటన రద్దయ్యింది. ఒప్పందంలో మొదటి దశను ఈ ఏడాది అక్టోబర్‌నవంబర్ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇదిలా ఉండగా, మరోవైపు ఇరుదేశాల మధ్య చర్చలు సానుకూలంగానే కొనసాగుతున్నాయని భారత వాణిజ్యశాఖ మంత్రి పీయూశ్ గోయల్ ఇటీవల తెలిపారు. ఇరు పక్షాలు ఈ చర్చలపై సంతృప్తికరంగా ఉన్నాయని అన్నారు. మొదటి విడత ఒప్పందం నవంబర్ నాటికి పూర్తి అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

## బండి సంజయ్ కు షాక్

**హైదరాబాద్, మహా :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు బిగ్ షాక్ ఇచ్చారు. బండి సంజయ్‌పై రూ.10 కోట్ల పరువు నష్టం దావా వేశారు. సిటీ సివిల్ కోర్టులో రూ.10 కోట్లకు దావా పిటిషన్ వేశారు కేటీఆర్. ఈ మేరకు కోర్టులో కేటీఆర్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే, డిసెంబర్ 15వ తేదీకి విచారణను వాయిదా వేసింది సిటీ సివిల్ కోర్టు. కాగా, ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్ పై బండి సంజయ్ వ్యాఖ్యలు చేయడంతోనే ఈ పరువునష్టం దావా వేశారు. ఎమ్మెల్యేల ఫోన్లు, తన కుటుంబసభ్యుల ఫోన్లను కేటీఆర్ ట్యాప్ చేయించారని గతంలో బండి సంజయ్ ఆరోపించారు. బండి సంజయ్ ఆరోపణలపై ఆగస్టులో కేటీఆర్ లీగల్ నోటీసులు పంపారు. బండి సంజయ్ నుంచి నోటీసులకు రిప్లై రాకపోవడంతో తాజాగా పరువు నష్టం దావా వేశారు.

**కేటీఆర్ ఫిర్యాదులోని ముఖ్యాంశాలు:**

'2025 ఆగస్టు 8న బండి సంజయ్ తప్పుడు, అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఎస్ఐబీ (స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్) దుర్వినియోగం, ఫోన్ ట్యాపింగ్, ఆర్థిక అవకతవకలకు నన్ను ముడిపెట్టారు. సంజయ్ వ్యాఖ్యలను ఏబీఎన్ తెలుగు, ఎన్టీవీ, టీవీ5, వీ6, ఏఎన్ఎన్ తెలుగు వంటి టీవీ ఛానెళ్లు, అలాగే ఇండియా టుడే, ఎన్డీటీవీ, డెక్కన్ హెరాల్డ్, టైమ్స్ ఆఫ్ ఇండియా వంటి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, మరియు ఎక్స్ (ట్విట్టర్), యూట్యూబ్, గూగుల్, మెటా (ఫేస్‌బుక్/ఇన్‌స్టాగ్రామ్) వంటి సోషల్ మీడియా సంస్థలలో విస్తృతంగా ప్రసారమయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు కేవలం పరువుకు భంగం కలిగించడమే కాకుండా.. నా వ్యక్తిత్వాన్ని దెబ్బతీయడానికి ఉద్దేశించినవిగా ఉన్నాయి' అని కేటీఆర్ పేర్కొన్నారు.

**కేటీఆర్ డిమాండ్ చేసిన పరిహారాలు**

బండి సంజయ్ బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలి. తదుపరి పరువు నష్టం కలిగించే కంటెంట్‌ను ప్రచురించకుండా లేదా ప్రసారం చేయకుండా నిందితులను నిరోధించే ఉత్తర్వులు ఇవ్వాలి. ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు, మీడియా పోర్టల్స్ నుంచి పరువు నష్టం కలిగించే కథనాలు, వీడియోలు, పోస్టులను తక్షణమే తొలగించాలి.

# ఊర్లలో అత్తాకోడళ్ల మధ్య కొత్త పంచాయితీ



**హైదరాబాద్, మహా:** రేవంత్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో 13 లక్షల పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్మెంట్ ఇవ్వడానికి ఒక్క పైసా కూడా లేదని డిప్యూటీ సీఎం చెప్పడం కాంగ్రెస్ ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమన్నారు. విద్యార్థుల ఫీజుల కోసం లేని డబ్బులు, కమీషన్లు, కాంట్రాక్టులకు మాత్రం ఎక్కడి నుంచి వస్తున్నాయో ప్రభుత్వం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో జరిగిన జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెంగళరావు నగర్ డివిజన్ స్థాయి బూత్ కమిటీ సమావేశంలో పాల్గొన్న కేటీఆర్, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తాము 20 వేల కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బిల్లులను చెల్లించామన్నారు. 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు గత కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన మూడు వేల కోట్ల రూపాయలను కూడా చెల్లించామన్నారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం డబ్బులు లేవన్న సాకుతో పెండింగ్ బకాయిలను ఇవ్వడం లేదని విమర్శించారు. డబ్బులన్నీ ఉద్యోగుల జీతాలు, సంక్షేమ పథకాలకే ఖర్చవుతున్నాయి, రీయింబర్స్మెంట్‌కు ఒక్క పైసా కూడా లేదని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క చెప్పడం సిగ్గుచేటు అన్నారు. కాలేజీల బంద్‌ను ఆపి వెంటనే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇక రాష్ట్రంలో తీవ్రంగా ఉన్న యూరియా కొరత, సంక్షోభానికి కాంగ్రెస్ పార్టీనే ప్రధాన కారణమన్నారు కేటీఆర్. రైతుల కోసం కేటాయించిన యూరియాను కాంగ్రెస్ నాయకులే బ్లాక్ మార్కెట్‌లో అమ్ముతున్నారని ఆరోపించారు. మిర్యాలగూడ కాంగ్రెస్ ఎమ్మెల్యే గన్‌మ్యాన్ ఒక లారీ లోడ్ యూరియాను ఎత్తుకుపోవడం రాష్ట్రంలో కాంగ్రెస్ నేతల దోపిడికి నిలువెత్తు నిదర్శనమన్నారు.

**క్రైమ్ రేట్ విపరీతంగా పెరిగింది..**

కేసీఆర్ కిట్లు, బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫాలు అన్నింటినీ ఆపేశారని చెప్పారు. ప్రజా సమస్యలను పరిష్కరించకుండా కాంగ్రెస్ నాయకులు అందినకాడికి దోచుకుతింటున్నారని మండిపడ్డారు. అప్పులు చేయకుండా ఆదాయం పెంచి పాలన చేస్తామని ఎన్నికల ప్రచారంలో చెప్పుకున్న కాంగ్రెస్ నేతలు అధికారంలోకి వచ్చిన 24 నెలల్లో ఒక్క హామీ కూడా అమలు చేయలేకపోయారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి నిర్వాకంతో ఊర్లలో అత్తాకోడళ్ల మధ్య కొత్త పంచాయతీలు మొదలైనయన్నారు. హైదరాబాద్‌లో పట్టపగలే దోపిడీలు, అత్యాచారాలు జరుగుతున్నాయని, క్రైమ్ రేట్ విపరీతంగా పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలపై ప్రేమ ఉంటే వర్షాలతో ఇబ్బందులు పడుతున్న ప్రాంతాలకు మంత్రులు పోవాలి కాని ఉప ఎన్నికల ప్రచారంలో తిరగొద్దన్నారు. కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావాలని తెలంగాణలోని ప్రతి ఒక్కరు కోరుకుంటున్నారన్న కేటీఆర్, గులాబీ జైత్రయాత్ర జూబ్లీహిల్స్ ఉపఎన్నికతోనే మొదలవ్వాలన్నారు. తెలంగాణ దివాలా తీసింది, ఎయిడ్స్ పేషెంట్, క్యాన్సర్ పేషెంట్ అంటూ రేవంత్ రెడ్డి రాష్ట్రం పరువు తీస్తున్నాడని కేటీఆర్ విమర్శించారు. ఆరు గ్యారెంటీలు ఇవ్వకుండా మోసం చేసినందుకు, ఫీజు రీయింబర్స్మెంట్ ఇవ్వకుండా విద్యార్థులను, వారి తల్లిదండ్రులను గోస పెడుతున్నందుకు, హైదరాబాద్‌ను ఆగం చేసినందుకు కాంగ్రెస్ పార్టీకి జూబ్లీహిల్స్ ప్రజలు బుద్ధి చెప్పాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

# కేటీఆర్‌కు కౌంటర్

**కరీంనగర్, మహా:** కేటిఆర్ ఇజ్జత్ దావా వేసి బెదిరించే ప్రయత్నం చేస్తున్నారని, న్యాయపరంగా ఎదుర్కొంటామని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. తొమ్మిది సార్లు జైల్ కు వెళ్ళి వచ్చినా...వందకు పైగా కేసులు ఉన్నాయన్నారు. కేటిఆర్ మాదిరిగా ఇజ్జత్ దావాలు వేయాలంటే తాము అనేక కేసులు వేయవచ్చని, తాను రాజకీయంగా ఎదుర్కొంటానని, బెదిరించేందుకు ఇజ్జత్ దావా వేయనన్నారు. తాను లవంగం తింటే తంబాకు అన్నారని, దమ్ముంటే కుటుంబ సభ్యులతో దేవుడు సన్నిధికి రమ్మని సవాల్ విసిరాను.. కేటిఆర్ ఎందుకు రావడం లేదన్నారు. అమెరికాలో ఎవరెవరికి ట్విట్ చేశావో? నీ సంగతి ఏంఓ త్వరలో అన్ని ఆధారాలతో బయటపెడతా. తెలంగాణకు కేంద్రం 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సప్లై చేసింది. కేవలం 9 లక్షల యూరియా మాత్రమే పంపిణీ చేశారు. మిగతా మూడు లక్షలు ఏమైంది... బ్లాక్ మార్కెట్ చేశారు. నువ్వు డ్రగ్స్ తీసుకోలేదని ముందుకు వచ్చే ధైర్యం ఉందా? సిరిసిల్లలో వరదలు వస్తే కేటీఆర్ ఎందుకు స్పందించడు? వ్యక్తిగతంగా వద్దని చెప్పను. నేను రాజకీయ నాయకుడిని రాజకీయంగా ఎదుర్కొంటానని సంజయ్ అన్నారు.

## ప్రజాపాలన దినోత్సవంగా సెప్టెంబర్ 17

**హైదరాబాద్, మహా:** నిజాం ప్రభువు పాలన నుంచి తెలంగాణ ప్రాంత ప్రజలు (హైదరాబాద్ సంస్థానం) స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్న సెప్టెంబర్ 17వ తేదీని రాజకీయ పార్టీలు తెలంగాణ విమోచనమా.. విలీనం, విముక్తి, విద్రోహ దినంగా ఎవరికి తోచినట్టు వారు నిర్వహించుకుంటున్నారు. ఈ క్రమంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది సెప్టెంబర్ 17ను ప్రజా పాలన దినోత్సవం నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు అన్ని జిల్లా కేంద్రాల్లో ఆయా జిల్లా ఇంఛార్జి మంత్రి జాతీయ జెండా ఎగురవేయాలని సర్క్యులర్ జారీ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. సీఎం రేవంత్ రెడ్డి సైతం సెప్టెంబర్ 17వ తేదీన రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో జాతీయ జెండా ఎగరవేయనున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆయన సొంత జిల్లా ఖమ్మంలో జెండా ఆవిష్కరించనున్నారు. తెలంగాణ ప్రభుత్వం సెప్టెంబర్ 17ను ప్రజా పాలన దినోత్సవంగా .. కేంద్ర ప్రభుత్వం మాత్రం తెలంగాణ విమోచన దినోత్సవంగా వేడుకలు నిర్వహిస్తోంది. ఈ ఏడాది తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్సింగ్ హాజరై జెండా ఆవిష్కరించనున్నట్లు సమాచారం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సెప్టెంబర్ 17ను జాతీయ సమైక్యతా దినోత్సవంగా నిర్వహించడం గమనార్హం.

## రేవంత్ సర్కార్ గుడ్ న్యూస్

(మొదటిపేజీ తరువాయి)


మంగళవారం నుంచి ఇంజనీరింగ్ కళాశాలలు యథావిధిగా తెరచుకోనున్నట్లు తెలిపారు. అయితే ఈ వారంలో రూ.600కోట్లు, దీపావళికి మరో రూ.600కోట్ల నిధులు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద విడుదల చేసేందుకు కాంగ్రెస్ సర్కార్ హామీ ఇచ్చినట్లు డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఉన్నతాధికారులు, విద్యాసంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ప్రభుత్వానికి కళాశాల యాజమాన్యాలు సమర్పించిన ప్రతిపాదనల్లో, ప్రస్తుతానికి రూ. 700 కోట్లు విడుదల చేయాలని కోరాయి. ఇందులో వృత్తి విద్యా కళాశాలలకు రూ. 500 కోట్లు, డిగ్రీ, పీజీ కళాశాలలకు రూ. 200 కోట్లు వెంటనే చెల్లించాలని విన్నవించాయి. అయితే, చర్చల అనంతరం ప్రభుత్వం రూ. 600 కోట్లు వెంటనే విడుదల చేయడానికి అంగీకరించింది. కళాశాలలు వాటి ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కడంతో పాటు, విద్యార్థులపై ఒత్తిడి కూడా తగ్గుతుంది.

# తెలంగాణ రాష్ట్రాన్ని సమిష్టిగా అభివృద్ధి చేద్దాం

## మంచిర్యాల రైల్వే స్టేషన్ ఆధునికరణకు 26 కోట్లు

### తెలంగాణలో ఐదు వందే భారత్ రైళ్ళు నడుస్తున్నాయి...మరో రెండు రైళ్లకు ప్రతిపాదనలు

### మంచిర్యాల వందే భారత్ రైలు హాల్టింగ్ సభలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



(మొదటిపేజీ తరువాయి)

అనంతరం నిర్వహించిన సభలో కేంద్ర మంత్రి సంజయ్ మాట్లాడుతూ భారతదేశ వ్యాప్తంగా ప్రజల రాకపోకల సౌలభ్యం కొరకు లక్ష 95 వేల కోట్ల రూపాయల వ్యయంతో 2019 సంవత్సరంలో 150 వందే భారత్ రైళ్లను దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించారని వెల్లడించారు. అందులో తెలంగాణ రాష్ట్రంలో ఐదు రైళ్ళు రాకపోకలు కొనసాగిస్తున్నాయని చెప్పారు. మరో రెండు వందే భారత్ రైళ్ళు హైదరాబాదు నుండి పూణేకు, మరొకటి హైదరాబాద్ నుండి నాందేడ్ కు రైళ్లను అతి త్వరలో ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. గత 2014 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రానికి 258 కోట్ల రూపాయలు విడుదల చేస్తే ప్రస్తుతం నరేంద్ర మోడీ ప్రభుత్వం 5300 కోట్ల రూపాయలను అభివృద్ధికి కేటాయించిందని చెప్పారు. దేశంలో ఇంకా 40 రైల్వే కొత్త ప్రాజెక్టు పనులు 4200 కోట్ల రూపాయలతో కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ పనుల పూర్తికి 80 వేల కోట్ల రూపాయలు వెచ్చించేందుకు నరేంద్ర మోడీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైనప్పటినుండి ఇప్పటివరకు 1,50,000 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇచ్చినట్లు కేంద్ర మంత్రి చెప్పారు. గతంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కేంద్ర ప్రభుత్వాన్ని దూషించడమే పనిగా పెట్టుకుని అభివృద్ధికి నిధులు అడగలేదని ఆరోపించారు. దానితో ఇక్కడ రహదారుల అభివృద్ధి కొంటుపడిందని చెప్పుకొచ్చారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పై ఆరోపణలు, నిందలు మాని అభివృద్ధి, సంక్షేమం వైపు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ పయనించాలని హితవుపలికారు.

**మంచిర్యాల రైల్వే స్టేషన్ ఆధునికరణకు 26 కోట్లు**

అమృత్ భారత్ పథకం కింద మంచిర్యాల రైల్వే స్టేషన్ ఆధునికరణ కొరకు 26 కోట్లు రూపాయలు కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్నట్లు కేంద్ర హోంశాఖ సహాయం మంత్రి బండి సంజయ్ వెల్లడించారు. ఇవే కాకుండా మూడు కోట్ల 50 లక్షల వ్యయంతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులకు నిధులు మంజూరైనట్లు ఆయన వెల్లడించారు. రానున్న కొద్ది రోజుల్లో మంచిర్యాల రైల్వే స్టేషన్ ఎయిర్ పోర్టులను మైమరిపించే దిశగా రూపుదిద్దుకుంటుందని చెప్పారు. అంతకు ముందు తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద, పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణులు మాట్లాడుతూ మంచిర్యాల నుండి రైల్వే శాఖకు ఇక్కడనుండి 10 వేల కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వానికి వెళుతున్నాయని అన్నారు. అందులో భాగంగా ప్రజల నుండి వందే భారత్ రైలును మంచిర్యాలలో ఆపాలని వచ్చిన వినతుల మేరకు చేసిన ప్రయత్నం ఫలించిందని ఆనందం వ్యక్తం చేశారు. వచ్చే సంవత్సరం జనవరి నాటికి తమిళనాడు ఎక్స్ ప్రెస్ రైలును మంచిర్యాల రైల్వే స్టేషన్ లో హాల్టింగ్ కొరకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ పార్టీల నేతలు, కార్యకర్తలు కేరింతలు, ఆనందోత్సవాలు మధ్య కేంద్ర మంత్రి, రాష్ట్ర మంత్రి, ఎంపీ, ఎమ్మెల్సీ, రైల్వే ఉన్నతాధికారులు మంచిర్యాల రైల్వే స్టేషన్ లో ఆగిన రైలును పచ్చజెండా ఊపి హైదరాబాద్ కు సాగనంపారు.

ANN తెలుగు
మహా పత్రిక
03
మంగళవారం, తిరుపతి | 16-09-2025 | జనరల్ వార్తలు | GENERAL NEWS | WWW.MAHAADAILY.COM

# భూలోకంలోనే నరకం అనుభవించా..

## నన్ను బీఆర్ఎస్ నుండి బయటకు పంపి ఏం సాధించారు?

## హుజూరాబాద్ లో ఎంపీ ఈటల రాజేందర్ ఆసక్తికర వ్యాఖ్యలు



**హుజూరాబాద్, మహా :** ఈటల రాజేందర్ సహా పలువురు సీనియర్లు బీఆర్ఎస్ ను వీడిపోవడానికి హరీశ్ రావు, సంతోశ్ రావే కారణం అంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత చేసిన వ్యాఖ్యలపై ఎంపీ ఈటల రాజేందర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నన్ను బీఆర్ఎస్ నుంచి బయటకు పంపించి వారు ఏం సాధించారని ప్రశ్నించారు. నేను నవ్వు ముఖంతోనే ఉన్నానని చెప్పారు. సోమవారం హుజూరాబాద్ లో మీడియాతో మాట్లాడిన సందర్భంగా కవిత ఆరోపణలపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నపై ఈటల స్పందించారు. యూరియా, ఫీజు రీయింబర్స్ మెంట్ వంటి ఇంత మంచి సబ్జెక్ట్ పై మాట్లాడక ఆ దిక్కుమాలిన విషయం గురించి ఎందుకు అని అన్నారు. ఆ పార్టీలో ఉండగా నన్ను హింస పెడితే పెట్టొచ్చు. కానీ నాకేమొచ్చింది వారికి ఏమొచ్చిందో అందరికి తెలుసన్నారు. భూలోకంలోనే నరకం అనుభవించిన వ్యక్తిని నేను అని చెప్పారు.

**నా జీవితంలో మొదటి సారి చూస్తున్న:**

ప్రైవేట్ కాలేజీలకు ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు, గెస్ట్ లెక్చరర్లు, సిబ్బంది బకాయుల గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన చేయాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఈసమస్యలను ముఖ్యమంత్రి పట్టించుకోకుండా మాటలతో అదరగొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మీ పర్యటనలపై దినపత్రికల్లో వస్తున్న పతాకశీర్షికలను చూసి మురిసిపోతున్నారు కానీ వాటి వెనుక నలిగిపోతున్న ప్రజల గాథను ఆలోచించాలన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ అనేది ప్రైవేట్ కాలేజీల సమస్య కాదని లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లి తండ్రులు, లక్షల మంది లెక్చరర్ల సమస్య అన్నారు. ఈ విషయంలో భేషజాలకు పోకుండా సమస్యను పరిష్కరించాలని బీజేపీ తరపున డిమాండ్ చేశారు. తాను ఇన్నేళ్లుగా ప్రభుత్వంలో ఉండి అనేక బాధ్యతలు చూశానని కానీ ఇంత బాధ్యతారాహిత్యమైన ప్రభుత్వాన్ని మాత్రం తొలిసారి చూస్తున్నానని విమర్శించారు. ఇది మంచిది కాదన్నారు. యూరియా కొరత విషయంలో రాష్ట్ర ప్రభుత్వానిదే నిర్లక్ష్యం అని విమర్శించారు. వర్షాలు బాగా వర్షాలు పడితే యూరియా బాగా వాడుతారని అంతే తప్పా యూరియా వాడకూడదని చెబితే ఎలా అన్నారు. ప్రభుత్వానికి అంచనా ఉండాలి కదా? బఫర్ స్టాక్ పెట్టుకోవాలి కాదా అని ప్రశ్నించారు. కేంద్రప్రభుత్వంపై నిందలు వేయడం ఆపేయాలన్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు.

# తెలంగాణకు అదనంగా 40 వేల టన్నుల యూరియా

- ఈ నెలలో 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కావాలని మంత్రి వినతి
- ఈ వారం 80వేల టన్నుల సరఫరాకు కేంద్రం అంగీకారం
- వరి, మొక్కజొన్న, పత్తి ప్రధాన పంటలకు యూరియా అత్యవసరం



**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్ర సర్కారు ప్రయత్నాలు ఫలించాయి. ఈసారి వానలు బాగా పడి.. సాగు అధికంగా ఉండడంతో యూరియా అవసరం ఎక్కువ ఏర్పడింది. దీంతో ఎక్కడికక్కడ యూరియా కోసం క్యూలైన్లు, రైతుల ఆగచాట్లు, దక్కుతుందో లేదోనన్న ఆందోళన గత కొద్దిరోజులుగా రాష్ట్రంలో కనిపించింది. ఈ సమస్య నివారణకు గత కొద్దిరోజులుగా రాష్ట్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఎట్టకేలకు ఫలించాయి. యూరియా కొరతతో ఇబ్బందులు పడుతోన్న రైతులకు భారీ గుడ్ న్యూస్ కేంద్రం చెప్పింది, తెలంగాణ రాష్ట్రానికి అదనంగా 40 వేల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయిస్తూ కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఢిల్లీలో కేంద్ర కార్యదర్శిని కలిసి చేసిన విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. దేశీయ ఉత్పత్తి ఆశించిన స్థాయిలో లేని నేపథ్యంలో విదేశాల నుంచి దిగుమతి చేసుకునే యూరియాను రాష్ట్రానికి కేటాయించారు. ఇప్పటికే కేటాయించిన 40 వేల టన్నులకు ఇది అదనం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యూరియా అంశంపై ప్రతిరోజూ వ్యవసాయ మంత్రి, ఉన్నతాధికారులతో మాట్లాడుతూ కొరత నివారణకు చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేస్తున్నారు.

**కేటాయిస్తూ ఉత్తర్వులు**

తెలంగాణ రైతుల అవసరాలకు సరిపడా యూరియాను వీలైనంత త్వరగా కేటాయించి, పంపిణీ అయ్యేలా చూడాలని ఢిల్లీలోని కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ కార్యదర్శి రజత్ కుమార్ మిశ్రాను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా సోమవారం తెలంగాణ రైతులకు సరిపడా యూరియాను ఈ పది రోజుల్లో సరఫరా చేయాలని, వివిధ కారణాలతో యూరియా దిగుమతి ఆశించిన స్థాయిలో లేదని మంత్రి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో సాగులో ఉన్న వరి, మొక్కజొన్న, పత్తి వంటి ప్రధాన పంటలకు యూరియా అత్యవసరమని.. ముఖ్యంగా ఈ పదిహేను రోజులు వ్యవసాయ సీజన్‌లో కీలకమైనవని అన్నారు. ఈ సమయంలో రైతులకు ఎరువులు అందుబాటులో లేకపోతే పంటలు తీవ్రంగా దెబ్బతింటాయని.. అందువల్ల యూరియా సరఫరా నిరంతరంగా కొనసాగేలా చూడాలని కేంద్రాన్ని కోరామని తెలిపారు. అలాగే అంతకు ముందు నెలల్లో ఏర్పడిన యూరియా లోటును పూడ్చే విధంగా ఈ నెలలో 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కావాలని కోరామని చెప్పారు. అలాగే రానున్న 10 రోజుల్లో మరో లక్ష మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేయాలని కోరగా.. ఈ వారంలో 80 వేల మెట్రిక్ టన్నులను సరఫరా చేస్తామని రజత్ కుమార్ మిశ్రా చెప్పారని వెల్లడించారు.

**అదనపు కేటాయింపు ఇలా**

వివిధ పోర్టులకు ఓడల ద్వారా వచ్చిన యూరియాలో తెలంగాణకు కేటాయింపుల వివరాలు..

మంగళూరు, ఎంవీ రెక్ గ్రేస్2700
కాకినాడ, ఎంవీ జీఎన్ రూబి8100
కాకినాడ, ఎంవీ గ్రేస్ ఆర్మోనీ 7800
కృష్ణపట్నం, ఎంవీ ఎన్డీవర్13000
జైగఢ్, ఎంవీ వాడి అల్బోస్టాన్8100

# మహా పత్రిక బ్రోచర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**యాదాద్రి భువనగిరి, మహా :** మహా పత్రిక బ్రోచర్ ను సోమవారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆవేజ్ చిస్టీ,మాజీ మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు,కాంగ్రెస్ నాయకులు, రిపోర్టర్ ఎర్ర జాన్సన్ పాల్గొన్నారు. మహా పత్రిక పాఠకుల ఆదరణతో మంచి పేరు తెచ్చుకోవాలని, ప్రజలపక్షం వహించాలని ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా అన్నారు.

# నేటి నుంచి ఆరోగ్యశ్రీ బంద్

- అర్ధరాత్రి నుంచి సేవలు నిలిపివేయనున్నట్లు నెట్ వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ ప్రకటన
- ప్రభుత్వం రూ.1400 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని వెల్లడి

**హైదరాబాద్, మహా:** ఆరోగ్య శ్రీ బకాయిలు చెల్లించకపోవడంతో.. తెలంగాణలో మరోసారి ఆ సేవలను నిలిపివేయనున్నట్లు ప్రైవేట్ నెట్ వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ సోమవారం ప్రకటించింది. మంగళవారం.. అంటే సెప్టెంబర్ 16వ తేదీ అర్ధరాత్రి నుంచి ఈ సేవలను నిలిపివేయనున్నట్లు వెల్లడించింది. ఆరోగ్య శ్రీ సేవల ద్వారా ప్రైవేటు ఆసుపత్రులకు రూ.1400 కోట్లు చెల్లించాల్సి ఉందని తెలిపింది. ఈ బకాయిలు చెల్లించడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని విమర్శించింది. దీనిపై ప్రభుత్వం నుంచి ఇప్పటివరకూ ఎటువంటి సానుకూల ప్రకటన రాలేదని పేర్కొంది. ఈ నేపథ్యంలో సమ్మె నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. నిధులు లేమి కారణంగా.. హాస్పిటల్స్ నడిపించే పరిస్థితి లేదని ప్రైవేట్ హాస్పిటల్స్ అసోసియేషన్ ఒక ప్రకటనలో పేర్కొంది. బిల్లులు పొందాల్సిన జాబితాలో దాదాపు 400 హాస్పిటల్స్ ఉన్నట్లు సమాచారం. గత ఏడాదిగా హాస్పిటల్స్‌కు ప్రభుత్వం నగదు చెల్లించడం లేదని యాజమాన్యాలు వాపోతున్నాయి. అయితే ఈ అంశంపై ఆగస్టు 31వ తేదీనే ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశామని హాస్పిటల్స్ యాజమాన్యం తెలిపింది. ఆ రోజు అర్ధరాత్రి నుంచే సేవలు బంద్ చేస్తామని ప్రభుత్వాన్ని స్పష్టం చేశామని.. దీంతో ఆరోగ్య శాఖ మంత్రి రంగంలోకి దిగి ఆర్థిక శాఖ మంత్రితో మాట్లాడి నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారని తెలిపింది. అయినా ఇప్పటివరకూ నిధులు రాకపోవడంతో సమ్మెకు దిగబోతున్నట్లు వెల్లడించింది. కానీ రెండు వారాలు గడిచినా.. ఆ నిధులు ఇప్పటి వరకు విడుదల చేయలేదని యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో సేవలను నిలిపివేస్తున్నట్లు స్పష్టం చేసింది.

# బీజేపీకి గవర్నర్ చప్రాసీనా?

- ఆర్ఎస్ఎస్ కార్యకర్త జిష్ణు దేవ్ వర్మకు చరిత్ర తెల్వదు
- గవర్నర్‌పై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ హాట్ కామెంట్స్



**ఢిల్లీ, మహా:** తెలంగాణ గవర్నర్‌పై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ హాట్ కామెంట్స్ చేశారు. బీజేపీకి జిష్ణు దేవ్ వర్మ చప్రాసీలుగా వ్యవహరిస్తున్నారని, కాషాయ పార్టీ నేతలు ఏది చెబితే దానికి తలాడిస్తున్నాడని ఆరోపించారు. సెప్టెంబర్ 17 గురించి ప్రజలకు వక్ర భాష్యం చెబుతున్నారని ఫైర్ అయ్యారు. నాడు తెలంగాణ సాయుధ పోరాటంలో రాజాకార్లకు వ్యతిరేకంగా ప్రాణాలకు ఎదిరొడ్డి పోరాడింది కేవలం కమ్యూనిస్టులు మాత్రమే అని స్పష్టం చేశారు. సోమవారం ఢిల్లీలో నారాయణ మీడియాతో మాట్లాడుతూ 'తెలంగాణ గవర్నర్ చరిత్రను వక్రీకరించారు. సాయుధ పోరాటంతో భయపడ్డ నిజాం పటేల్ కు సరెండర్ అయ్యారు. అసలు స్వాతంత్ర పోరాటానికి బీజేపీకి ఏం సంబంధం.? తెలంగాణ ఉద్యమంలోనూ వారు పాల్గొనలేదు. బ్రిటిష్ తొత్తులుగా పనిచేశారు. ఎన్నికైన ప్రభుత్వాలను డార్క్‌లో పెట్టేందుకు గవర్నర్లు ప్రయత్నం చేస్తున్నారు. ఆర్ఎస్ఎస్ కార్యకర్త జిష్ణు దేవ్ వర్మకు చరిత్ర తెల్వదు. దేశం కోసం చనిపోయిన వాళ్లను అమ్ముకుని బీజేపీ నేతలు ప్రచారం చేసుకుంటున్నారు. రాబోయే రోజుల్లో సావర్కర్, గాడ్సే లను దేవుళ్లను చేస్తారు. ప్రతి ఏటా సెప్టెంబర్ 17 రాగానే హడావుడి చేస్తున్నారని' వ్యాఖ్యానించారు.

# 10 మందిపై అనర్హత వేటు వేయండి

- స్పీకర్‌కు ప్రత్యేకంగా కలిసి విజ్ఞప్తి చేశాం
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి



**హైదరాబాద్, మహా:** పార్టీ మారిన 10 ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలంగాణ మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మీడియాకు తెలిపారు. శాసనసభ ప్రాంగణానికి వెళ్లిన ఆ పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు శాసనసభ అదనపు కార్యదర్శి ఉపేందర్‌రెడ్డిని కలిశారు. తమ పార్టీ నుంచి 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరినట్లు ఆధారాలు అందించారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన వారిపై మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు కూడా చెప్పిందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. "పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఇచ్చిన వివరణను అధికారులు మాకు తెలియజేశారు. వారి వివరణపై బీఆర్ఎస్ నిర్ణయం చెప్పాలని మాకు మూడు రోజులు గడువు ఇచ్చారు" అని అన్నారు.

# వక్ఫ్ చట్టం అమలుపై స్టేకు నిరాకరణ

- చట్టంలోని కీలక ప్రొవిజన్ ను నిలిపివేస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు
- మొత్తంగా చట్టంపై స్టే ఇవ్వాలన్న అభ్యర్థనను తోసిపుచ్చిన కోర్టు
- వక్ఫ్ బోర్డులో ముస్లింలే మెజారిటీ సంఖ్యలో ఉండాలని వ్యాఖ్య



**ఢిల్లీ, మహా:** వక్ఫ్ (సవరణ) చట్టం2025లో కీలక ప్రొవిజన్‌ను నిలిపివేస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కనీసం ఐదేళ్లపాటు ఇస్లాంను అనుసరించిన వ్యక్తి మాత్రమే ఆస్తిని వక్ఫ్ చేయడానికి అవకాశం ఉంటుందన్న దానిని నిలిపివేసింది. ఒక వ్యక్తి ఇస్లాంను అనుసరిస్తున్నట్లు నిర్ణయించేలా నిబంధనలు తయారుచేసేవరకు ఇది అమల్లో ఉండదని చెప్పింది. అదే సమయంలో వక్ఫ్(సవరణ)చట్టం 2025పై మొత్తంగా స్టే విధించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. కొన్ని సెక్షన్లకు మాత్రం కొంత రక్షణ అవసరమని వ్యాఖ్యానించింది. వక్ఫ్ బోర్డులో ముస్లిం సభ్యుల సంఖ్య కచ్చితంగా మెజార్టీలో ఉండాలని కోర్టు పేర్కొంది. బోర్డ్ లేదా కౌన్సిల్‌లో అత్యధికంగా ముగ్గురు లేదా నలుగురు ముస్లిమేతర సభ్యులు ఉండాలని చెప్పింది. ఇక చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ముస్లిమే ఉండటం మంచిదని పేర్కొంది. ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ (సవరణ) చట్టం2025ను పూర్తిగా నిలిపివేయాలని దాదాపు 100కు పైగా పిటిషన్లు సుప్రీంకోర్టులో దాఖలయ్యాయి. ముస్లింల ఆస్తిని మెల్లగా లాగేసుకొనేందుకే అని వీటిల్లో ఆరోపించాయి. ఇక కేంద్రం మాత్రం పబ్లిక్, ప్రైవేటు ఆక్రణలకు గురికాకుండా రక్షించడానికి అని వాదించింది. వాస్తవానికి ఈ కేసు ఏప్రిల్‌లో పార్లమెంట్ ఈ బ్లిల్లును క్లియర్ చేసిన గంటల్లోనే సుప్రీంకోర్టుకు చేరింది. ముఖ్యంగా కోర్టులతో వక్ఫ్ ఆస్తిగా గుర్తించినవి, వ్యక్తులు, డీడ్ల ఆధారంగా వక్ఫ్ అయిన ఆస్తుల డీనోటిఫై అధికారాలను దీనిలో ప్రశ్నించారు.

మీరు జర్నలిస్ట్ అవ్వాలనుకుంటున్నారా?
జర్నలిజంలో రాణించి సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను అరికట్టాలనుకుంటున్నారా? అయితే మీకిదే సువర్ణావకాశం
ANN SCHOOL OF JOURNALISMలో
జాయిన్ అయ్యి నిజమైన జర్నలిస్టులుగా గుర్తింపు తెచ్చుకోండి.
గృహిణులు, నిరుద్యోగులు, విద్యార్థులకు
ఇదే మా ఆహ్వానం
అడ్మిషన్లు ప్రారంభమైనవి
అప్లికేషన్‌కు ఆఖరుతేదీ - సెప్టెంబర్ 12
తరగతులు ప్రారంభం : సెప్టెంబర్ 22
పరిమితమైన సీట్లు, సీనియర్ పాత్రికేయులతో విద్యాబోధన
మీరున్న చోటు నుండే ఆన్‌లైన్‌లో జర్నలిజం క్లాసులు
8 వారాలు, 16 ఆన్‌లైన్ క్లాసులు
కోర్సు పూర్తైన విద్యార్థులకు జర్నలిజం సర్టిఫికెట్ ఇవ్వబడును
మెరిట్ స్టూడెంట్స్ కు ఇంటర్న్ షిప్ అవకాశం.. రికమండేషన్ లెటర్
HURRY UP! త్వరపడండి...
FOR ADMISSIONS CONTACT: +91 74369 39999
SCAN ME
APPLY ON OUR OFFICIAL WEBSITE: WWW.ANNSCHOOLOFJOURNALISM.COM

ఉద్యోగావకాశం
పత్రికా రంగంలో నూతన ఒరవడి సృష్టిస్తున్న
మహా పత్రికకు
(RNI NO: APTEL/2003/09316)
ఏపీ, తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు జిల్లాల వారీగా
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
WWW.EPAPER.MAHAADAILY.COM
ఆసక్తి గల వారు సంప్రదించండి
MAHAAPATRIKA@GMAIL.COM,
95501 59679, 90001 41919



ఇప్పుడు దేశంలో ఉన్న అగ్రగామి నటీమణుల్లో ఒకరుగా ఉంది తమన్నా భాటియా.. అటు సినిమాలు, ఇటు ఐటమ్ సాంగ్స్ మరోవైపు వెబ్ సిరీస్‌తో దూసుకు పోతోంది. ప్రస్తుతం డయానా పెంటీతో కలిసి చేసిన 'డూ యు వాన్నా పార్టనర్' వెబ్ సిరీస్ సక్సెస్‌ను ఆమె ఎంజాయ్ చేస్తోంది, ఒక మహిళ స్వంతంగా వ్యాపార రంగంలో అది కూడా పురుషులు మాత్రమే చేయగలరు అని అందరూ నమ్మే మద్యం తయారీ రంగంలోకి మహిళలు ప్రవేశించడం... తదనంతర పరిస్థితుల చుట్టూ అల్లుకున్న అంశాలతో 'డూ యు వాన్నా పార్టనర్' రూపొందింది.

# అలాంటి మగవాడ్ని చీరలో ఊహించుకుంటాను : తమన్నా

ఈ సిరీస్ ప్రమోషన్‌లో భాగంగా ఆమె పలు ఇంటర్వ్యూల్లో మాట్లాడింది. ఈ సందర్భంగా ఆమె . ఒక పురుషుడు తనను 'ఇక తనేమీ చేయడానికి లేదు' లేదా 'అతనే తుది నిర్ణయం తీసుకున్నాడు అని భావించేలా చేసిన ప్రతిసారీ (అంటే ఆమెను చులకనగా తీసి పారేసిన సమయంలో) ఆమె ఎలా స్పందిస్తుందనే విషయం గురించి చెప్పుకొచ్చింది. ఇన్ని సంవత్సరాలుగా పురుషాధిక్య చిత్ర పరిశ్రమలో తన కంటూ ఒక ప్లేస్‌ను సొంతం చేసుకోవడం అనేది ఎలా సాధ్యమైందనే విషయంపైన కూడా తమన్నా ఈ సందర్భంగా మాట్లాడింది. అంతేకాక ఇటీవల తన నటన పట్ల విమర్శలు, ఎక్స్‌పోజింగ్‌పై వస్తున్న కొన్ని కామెంట్స్ గురించి కూడా ఆమె చెప్పాలనుకున్నట్టు ఆమె మాటల బట్టి అర్థమవుతుంది. ''ఒక పురుషుడు నాకు సంబంధించిన విషయాలలో తుది నిర్ణయం తీసుకున్నప్పుడు ఇక అందులో నేనేం చేయడానికి ఉండదు. అయితే, నాకు అనిపించేలా చేయడానికి కొందరు ప్రయత్నిస్తారు'' అంటూ చెప్పిందామె. అంటే ఒక సినిమాలో తాను చేసేదేముంది జస్ట్ ఏదో పాటల్లో అలా గ్లామరస్‌గా కనిపించడమే కదా అంటూ మాట్లాడి తన ప్రాధాన్యత తగ్గించాలని కొందరు మగవాళ్లు భావిస్తారనే అర్థం వచ్చేలా మాట్లాడింది. అలా వారు ప్రయత్నించినప్పుడల్లా, తాను అలాంటి మగవాళ్లను చీరలో లేదా కొన్ని గ్లామరస్ దుస్తుల్లో ఎక్స్‌పోజింగ్ చేస్తున్నట్టు ఊహించుకునే దానిని అంటూ చెప్పింది. ఆ ఆ ఊహల్లో అతను చాలా అసహ్యంగా కనిపించేవాడనీ అప్పుడే తనకు తానేం చేయగలదో అతనేం చేయలేడో అనేది తనకు అర్థమయ్యేదని అంటూ అమ్మాయిలు మాత్రమే గ్లామర్ కు కేరాఫ్ అని వారికి మాత్రమే ఎక్స్‌పోజింగ్ బాగుంటుందని చెప్పకనే చెప్పింది. కాబట్టి వారికి ఎప్పుడూ తన అవసరం ఉంటుందనే గ్రహింపు తెచ్చుకోవడమే తాను చేసే పనిని ధైర్యంగా చేసేలా చేసిందని అంది, ''ఎందుకంటే ఒక మహిళ చేయగలది, ఒక మహిళ మాత్రమే చేయగలదని నేను విశ్వసిస్తున్నాను.' అంటూ స్పష్టం చేసింది. అదే సమయంలో మంచి చెడుల గురించి కూడా ఆమె మాట్లాడింది. ''నువ్వు మంచి వ్యక్తివి అయినంత మాత్రానే ఎవరూ నీకు పని ఇవ్వరు. నువ్వు ఏదో ఒకటి చేయగలవని నీ దగ్గర ఏదో ఉందని అనుకుంటేనే ఎవరైనా నీకు పని ఇస్తారు.'' అంటూ తనకు ఎవరూ ఊరికే పని ఇవ్వడం లేదని గుర్తు చేసింది. ఏదేమైనా మన మనసులో ఉన్నదాన్ని బయట పెట్టడమే మంచిదని అంటోంది తమన్నా. ప్రజలు ఎలా భావిస్తారో అని ఎక్కువగా ఆందోళన చెందడం అంతిమంగా మనకు ప్రతికూలంగానే మారుతుంది'' అంటూ చెప్పుకొచ్చింది

# మృణాల్ ఠాకూర్ బ్యూటీ సీక్రెట్ ఇదే..



'సీతారామం'తో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నటి మృణాల్ ఠాకూర్. అభినయంతో పాటు సహజ సౌందర్యంతో ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్నది. చాలామంది బయటకు వచ్చిన సందర్భాల్లో మేకప్ లుక్‌లో కనిపిస్తుంటారు. కానీ, వారికి భిన్నంగా మృణాల్ మాత్రం నేచురల్‌గానే కనిపిస్తుంది. ఈ బ్యూటీ చర్మం ఎప్పుడూ కాంతివంతంగానే మెరుస్తూ ఉంటుంది. అయితే, తన బ్యూటీ సీక్రెట్‌ను సోషల్ మీడియా వేదికగా అభిమానులతో షేర్ చేసుకుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియోను షేర్ చేసింది. ఈ వీడియోలో మృణాల్ తాను రాత్రి పడుకునే ముందు ముఖానికి ఓ ఆయిల్‌ను అప్లయ్ చేసుకుంటానని చెప్పింది. ఆ ఆయిల్ వాడటాన్ని తన తల్లి సలహాతోనే ప్రారంభించానని చెప్పింది. అదే విషయాన్ని తల్లిని అడిగి మరింత వివరించాలన కోరింది. ఇంతకీ ఆ నూనె ఖరీదైన దేమీ కాదు. అందరూ వినియోగించే బాదం నూనే అని చెప్పింది. తన తల్లి సూచించిన ఈ చిట్కా తన చర్మానికి విశేషమైన కాంతిని ఇస్తుందని మృణాల్ చెప్పుకొచ్చింది. బాదం నూనెలో విటమిన్‌ఈ, ఒమేగా ఫ్యాటీ యాసిడ్లు, ప్రొటీన్లు, ఇతర ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి. ఇది సహజ మాయిశ్చరైజర్‌లా పని చేస్తుంది. అంతేకాక, యాంటీఏజింగ్ లక్షణాలు ఉండటం వల్ల చర్మం యువకంగా కనిపించడానికి తోడ్పడుతుంది. వయస్సు ప్రభావాలు తొందరగా కనిపించకుండా అడ్డుకుంటుంది. ఇక కళ్ల కింద కనిపించే నలుపు వలయాలు, చర్మం ఉబ్బినట్లు కనిపించే సమస్యలకు కూడా బాదం నూనె సమర్ధంగా పని చేస్తుంది. ఆ భాగంలో మృదువుగా మసాజ్ చేయడం వల్ల మంచి ఫలితాలు కనిపిస్తాయని సౌందర్య నిపుణులు సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా.. మృణాల్ ఖరీదైన కొనుగోలు చేయడం ఏమాత్రం నచ్చదట. ఖరీదైన బట్టలు కొనుగోలు చేసినా వాటితో ఎలాంటి ఉపయోగం లేకుండా దాచి ఉంచాల్సి వస్తుందని అభిప్రాయపడింది. ఇప్పటి వరకు తాను కొనుగోలు చేసిన ఖరీదైన డ్రెస్ రూ.2వేలు మాత్రమేనని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పింది. స్టార్ హీరోయిన్ అయినా తక్కువ ధరల్లోనే డ్రెస్‌లు కొనుగోలు చేస్తానని చెప్పడంతో అందరూ షాక్ అవుతున్నారు. మృణాల్ ఠాకూర్ మూవీ ఈవెంట్స్, ఇతర ఫంక్షన్లకు హాజరైన సందర్భంలోనే ఖరీదైన వస్త్రాలను ధరిస్తుండగా.. వాటిని రెంట్ తీసుకొని ధరిస్తుందట. భారీ ధర దుస్తులను కొనుగోలు చేయడం నచ్చదని.. బదులుగా ఆ డబ్బులను ఫుడ్, ప్రాపర్టీస్ కొనుగోలు చేసేందుకు ఖర్చు చేస్తానని చెప్పడం విశేషం. మృణాల్ వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. మృణాల్ మరాఠి కుటుంబంలో పుట్టి పెరిగింది. 2012 ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. కెరియర్ ప్రారంభంలో టీవీల్లో నటించింది. ఆ తర్వాత బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. తెలుగులోకి 'సీతారామం'తో పరిచయమైంది. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ హిట్ సాధించడంతో ఒక్కసారిగా ఈ బ్యూటీ పేరు మారుమోగింది. అయితే, అవకాశాలు మాత్రం ఎక్కువగా రాలేదు. టాలీవుడ్‌లో మృణాల్ ఠాకూర్ నాని సరసన హాయ్ నాన్న, విజయ్ దేవరకొండ సరసన ఫ్యామిలీ స్టర్ సినిమాల్లో నటించింది. ప్రభాస్ కల్కి 2898 ఏడీ చిత్రంలో చిన్న పాత్రలో మెరిసింది. ప్రస్తుతం తెలుగులోకి అడివి శేష్ డెకాయిట్ : ఏ లవ్ స్టోరీతో పాటు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ - అట్లీ కాంబినేషన్ లో రాబోతున్న చిత్రం AA22xA6లో కీలక పాత్రలో నటించనున్నది. మరో రెండు హింద్రీ చిత్రాల్లో నటించనున్నది.



# తెలుగులో ధనుష్ ఇడ్లీ కొట్టు



తమిళ అగ్ర హీరో ధనుష్ స్వీయ దర్శకత్వంలో నటించి, ఆకాష్ భాస్కరన్‌తో కలిసి నిర్మించిన తమిళ సినిమా 'ఇడ్లీ కడై'. ఈ సినిమా.. 'ఇడ్లీ కొట్టు' పేరుతో అక్టోబర్ 1న తెలుగులో విడుదల కానుంది. శ్రీ వేదక్షర మూవీస్ పతాకంపై నిర్మాత రామారావు చింతపల్లి ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. దర్శకుడిగా ధనుష్ నాలుగో సినిమా ఇది. ఈ సినిమా గురించి నిర్మాత రామారావు చింతపల్లి మాట్లాడుతూ 'తెలుగు రైట్స్ మాకిచ్చినందుకు ధనుష్‌గారికీ, ఆయన టీమ్‌కు కృతజ్ఞతలు. తెలుగు నేలపై ధనుష్ కెరీర్‌లోనే హైయ్యస్ట్ థియేటర్లలో ఈ సినిమాను విడుదల చేయబోతున్నాం.' అని తెలిపారు. నిత్యామీనన్ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో అరుణ్ విజయ్, షాలిని పాండే, సత్యరాజ్, రాజ్‌కిరణ్ కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: కిరణ్ కౌశిక్, సంగీతం: జి.వి.ప్రకాశ్‌కుమార్, నిర్మాణం: డాన్ పిక్చర్స్, వండర్‌బార్ ఫిల్మ్స్ ప్రై.లిమిటెడ్.

# ఊర్వశి రౌతేలాకు ఈడీ నోటీసులు

బాలీవుడ్ హీరోయిన్స్ ఊర్వశి రౌతేలా, మిమి చక్రవర్తి చిక్కుల్లో పడ్డారు. బెట్టింగ్ యాప్ ప్రమోషన్స్ చేసిన వారిపై కొద్దిరోజులుగా ఈడీ దూకుడు చూపుతుంది. ఈ క్రమంలోనే తాజాగా వీరిద్దరికి నోటీసులు జారీ చేసింది. ఇప్పటికే టాలీవుడ్, బాలీవుడ్‌లోని స్టార్స్‌ను ఈడీ విచారించిన విషయం తెలిసిందే. ఈ నెల 16న ఢిల్లీలోని ఈడీ కార్యాలయానికి ఊర్వశి రౌతేలా, మిమి చక్రవర్తి విచారణకు హాజరు కావాలని అధికారులు తెలిపారు.

# బంపర్ ఆఫర్ కొట్టేసిన మిరాయ్ డైరెక్టర్..

## చిరు సినిమాకి పని చేసే అవకాశం, కాకపోతే..





మిరాయ్' సినిమాతో సినీప్రపంచాన్ని ఊపేసిన యువ దర్శకుడు కార్తీక్ ఘట్టమనేనికి తాజాగా మరో బంపర్ ఆఫర్ దక్కింది. దర్శకుడిగా తన తొలి చిత్రంతోనే బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న కార్తీక్, ఇప్పుడు మెగాస్టార్ చిరంజీవి సినిమాకు కెమెరామెన్‌గా ఎంపిక కావడం గర్వకారణంగా మారింది. సెప్టెంబర్ 12న గ్రాండ్‌గా విడుదలైన మిరాయ్ సినిమా, తొలి రోజే రూ.27 కోట్ల గ్రాస్ వసూళ్లు రాబట్టి ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా నిలిచింది. రెండో రోజుకే వసూళ్లు రూ.55 కోట్లను దాటి వెళ్లాయి. ఈ విజయం వెనుక కార్తీక్ ఘట్టమనేని కీలక పాత్ర పోషించాడు. అందుకు కారణం ఆయన ఈ సినిమాకి దర్శకుడిగాను, సినిమాటోగ్రాఫర్ గా పని చేశాడు. తాను రాసుకున్న కథను స్క్రీన్ మీద అదిరిపోయే విజువల్స్‌తో చూపించి ప్రేక్షకుల మనసులు గెలుచుకున్నాడు. ఈ క్రమంలో అందరి నుండి ప్రశంసలు అందుకుంటున్నాడు. ఇక ఇప్పుడు చిరు సినిమాకి పని చేసే అవకాశం కూడా అందుకున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే చిరంజీవి - బాబీ కొల్లి కాంబోలో "వాల్తేరు వీరయ్య" సూపర్ హిట్ అయ్యింది. ఇప్పుడు మళ్లీ అదే కాంబోలో మరో సినిమా రాబోతుంది. ఈ సినిమాను కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మించబోతోంది. తాజాగా వచ్చిన సమాచారం ప్రకారం, ఈ సినిమాకు కెమెరామెన్‌గా కార్తీక్ ఘట్టమనేనిని ఫైనల్ చేశారునే టాక్ నడుస్తుంది. దర్శకుడు బాబీ చెప్పిన కథకు విజువల్‌గా ఆ స్థాయి కిక్ రావాలంటే కార్తీక్‌ను మించేవాడు లేడనే నమ్మకంతో మేకర్స్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి స్క్రిప్ట్ వర్క్ పూర్తయినట్లు సమాచారం. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభం కానుంది. ఇక కార్తీక్ ఘట్టమనేని కెమెరా పనితనం , మెగాస్టార్ పర్‌ఫార్మెన్స్‌తో సినిమా మరో లెవెల్‌కు వెళుతుందని ముచ్చటించుకుంటున్నారు. యువతలో టాలెంట్ ఉంటే, అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయనే మరోసారి నిరూపణ అయ్యింది. అయితే ప్రస్తుతం ఇండస్ట్రీలో చక్కర్లు కొడుతున్న ఈ వార్తకి సంబంధించి పూర్తి క్లారిటీ రావలసి ఉంది.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad, Telangana, IN - 500034